RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | ఎడిటర్ : చెరుకు ఉపేందర్ | శనివారం | 30 -12 - 2023
సంపుటి: 1 | సంచిక : 225 | పేజీలు : 4 | వెల : 5/-

జేడీయూ అధ్యక్షుడిగా నితీష్‌కుమార్

4లో

గేరు మార్చిన 'కారు'!

భారత రాష్ట్ర సమితి
BHARAT RASHTRA SAMITHI

- బీజేపీకి దగ్గరయ్యేందుకు బీఆర్ఎస్ వ్యూహం
- హిందుత్వ నినాదంతో సయోధ్యకు సంకేతాలు
- పతిపక్షంగా రాష్ట్రంలో పరువు నిలుపుకునే ప్రయత్నం
- జాతీయ పార్టీలతో దోస్తీకి వెంపర్లాడుతున్న వైనం

హైదరాబాద్, ప్రభాతసూర్యుడు : తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత బీఆర్ఎస్ హిందుత్వ ఎజెండా ఎత్తుకుందా.. మొన్నటి వరకు ఎంఐఎంతో చెట్టాపట్టాల్ వేసుకుని తిరిగి, సమైక్య వాదంపై స్పీచ్‌లు దంచిన నేతలు ఇప్పుడు హిందుత్వమే తమకు శ్రీరామ రక్ష అనుకుంటున్నారా.. సమైక్య వాదానికి బీఆర్ఎస్ స్వస్తి పలికిందా.. అంటే అవుననే సమాధానం వస్తుంది గులాబీ భవన్ నుంచి. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ నేతల్లో హిందుత్వానికి మద్దతుగా మాట్లాడుతున్నారు. ప్రాంతీయ వాదాన్ని వదిలేసి జాతీయవాదంపై మాట్లాడుతున్నారు. ఇందుకు తాజాగా ఎమ్మెల్సీ, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తనయ కల్వకుంట్ల కవిత చేస్తున్న వ్యాఖ్యలే నిదర్శనం. ఇటీవల అయోధ్య రామమందిరం గురించి మాట్లాడిన కవిత, తాజాగా డీఎంకే అధినేత ఉత్తరాదివాసులపై చేసిన వ్యాఖ్యలను ఖండించారు. సనాతన ధర్మాన్ని కించపరుస్తుందని కాంగ్రెస్‌పై విమర్శలు చేశారు. ఇండియా కూటమిలో ఉన్న డీఎంకే నేతలు హిందువుల మనోభావాలు దెబ్బతినేలా సనాతన ధర్మాన్ని అవమానిస్తూ మాట్లాడినప్పుడు, హిందీ మాట్లాడే రాష్ట్రాలను గోమూత్ర రాష్ట్రలంటూ అవహేళన చేసినప్పుడు కూటమిలో కీలక పాత్ర పోషిస్తున్న కాంగ్రెస్ పార్టీ, ఆ పార్టీ అగ్రనేత అయిన 'ఎన్నికల గాంధీ' (రాహుల్‌గాంధీ) ఎందుకు స్పందించలేదని కవిత ప్రశ్నించారు. డీఎంకే నేతల వ్యాఖ్యలకు రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. హిజాబ్ వివాదంపై కూడా రాహుల్‌గాంధీ తన వైఖరిని వెల్లడించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అంటేనే మోసం, కుట్ర, మభ్యపెట్టడం అని విమర్శించారు. "ఈ రోజు మనం చాలా మంది రాజకీయ నాయకుల నుంచి దురదృష్టకరమైన ప్రకటనలను చూస్తున్నాం. కొన్ని వర్గాల నుంచి ఓట్లను సంపాదించడానికి ఈ ప్రక్రియ చివరికి మనం ఊహించలేని విధంగా దేశాన్ని విభజించగలదు' అని పేర్కొన్నారు. దురదృష్టవశాత్తు కాంగ్రెస్ మిత్రపక్షమైన డీఎంకే పార్టీ నాయకులు లోక్‌సభ ఎన్నికల్లో ఓట్ల కోసం విద్వేష వ్యాఖ్యలు చేస్తున్నారు. దేశాన్ని విచ్ఛిన్నం చేసేలా కొంత మంది నేతలు వ్యాఖ్యలు ఉన్నాయి. ఓట్ల కోసం దేశాన్ని అవమానించడం సరికాదు. ఇండియా కూటమికి పెద్దన్న పాత్ర పోషిస్తున్న కాంగ్రెస్ పార్టీ, ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఎందుకు స్పందించడం లేదు. దేశాన్ని ఐక్యం చేయడానికి భారత్ జోడో యాత్ర చేశానని రాహుల్ గాంధీ చెప్పుకుంటున్నారు. కానీ అందుకు వ్యతిరేకంగా వారి మిత్రపక్షం చేస్తున్న వ్యాఖ్యలపై మాత్రం స్పందించడం లేదు. కోట్లాది మంది హిందువుల మనోభావాలను దెబ్బతినేలా సనాతన ధర్మాంపై అనుచిత వ్యాఖ్యలు చేసినప్పుడే సీరియస్‌గా తీసుకొని రాహుల్ గాంధీ స్పందించి

మిగతా 2వ పేజీలో...

కాళేశ్వరం కట్టుకథ చెప్తం!

- ప్రకటించిన మంత్రుల బృందం
- ప్రాజెక్టును సందర్శించిన అమాత్యులు
- పవర్ పాయింట్ ప్రజెంటేషన్ పరిశీలన
- నిర్మాణంలో అక్రమాలున్నట్లు వ్యాఖ్యలు
- అవకతవకలను ఎత్తిచూపుతామని వెల్లడి
- మేడిగడ్డలో మంత్రులు తీవ్ర విమర్శలు

భూపాలపల్లి, ప్రభాతసూర్యుడు : కాళేశ్వరం ప్రాజెక్టు వాస్తవాలను ప్రజల ముందుకు తీసు కువస్తామని తెలంగాణ జలవనరుల శాఖ మంత్రి ఉత్త మ్‌కుమార్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌కు చెందిన తెలం గాణ మంత్రుల బృందం మేడిగడ్డను సందర్శించింది. మేడిగడ్డలో మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, పొంగులేటి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం ప్రభాకర్‌లు పర్య టిస్తున్నారు. మేడిగడ్డ నిర్మా ణంపై అధికారులు రూపొం దించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ను పరిశీ లిం చారు. ఈ ఏడాది అక్టోబర్ 21న మేడిగడ్డ ప్రాజెక్టు కుప్ప కూలింది. మేడిగడ్డ కుప్పకూలినప్పటి నుంచి ఇప్పటి వరకు కేసీఆర్ స్పందించలేదని ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆరోపించారు. మూడేళ్ల లో కాళే శ్వరం కుప్పకూలడం ప్రభుత్వానికి సిగ్గుచేట న్నారు. కాళేశ్వరంపై మా పార్టీ విధానం ఒకటే.. ప్రాణహిత చేవెళ్ల ని 35 వేల కోట్లతో నిర్మించాలి అనేది మా విధానం అన్నారు. కానీ ప్రాజెక్టు కట్టే పనిలో ఉండగా ప్రభుత్వం మారిందన్నారు. మా ప్లాన్ మార్చేసి.. ప్రాజెక్టు లొకే షన్ మార్చింది బీఆర్ఎస్ అన్నారు. పదేళ్లలో ఏం జరిగిందో అందరికి తెలుసన్నారు. 35 వేల కోట్ల తో వేయము కట్టలి అనుకున్నది.. కాళేశ్వరం పేరుతో లక్ష కోట్లకు పెరిగిందన్నారు. కాళేశ్వరం ప్రారంభం నుండే మాకు అనుమానాలు ఉన్నాయన్నారు.

దురదృష్టకరం:

కాళేశ్వరం డ్యామేజ్ కావడం దురదృష్టకరమన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులపై పూర్తి స్థాయిలో సమీక్షించనున్నారు. లక్షల కోట్లతో నిర్మించిన

మిగతా 2వ పేజీలో...

ఖజానాకు చలానా..!

- పెండింగ్ ఫైన్లతో సర్కారుకు ఆదాయం
- డిస్కౌంట్ ఆఫర్‌కు ప్రజల్లో భారీ స్పందన
- రెండు రోజుల్లో రూ.10కోట్లు వసూళ్లు

హైదరాబాద్, ప్రభాతసూర్యుడు : క్రిస్మస్, న్యూఇయర్‌కు షాపుల్లో డిస్కౌంట్ పెట్టినట్టు పెండింగ్ చలానాలు వసూలు చేసుకునేందుకు తెలంగాణ పోలీసు శాఖ డిసౌంట్ ఆఫర్ ప్రకటించింది. దీంతో పెండింగ్ చలానాలు క్లియరవుతున్నాయి. కోట్ల రూపాయాల్లో ఆదాయం వచ్చి పడుతోంది. ఇప్పటికే 10కోట్ల రూపాయల మేర వసూలు అయినట్టు సమాచారం. భారీ డిస్కౌంట్లు ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడిన వారికి ట్రాఫిక్ పోలీసులు చలాన్లు జారీ చేస్తుంటారు. అయితే... ఆ చలానాలు కట్టకుండా పెండింగ్ పెట్టేస్తారు వాహనదారులు. అవన్నీ రాబట్టుకునేందకు పెండింగ్ చలాన్లపై భారీ డిస్కౌంట్ ప్రకటించింది పోలీసు శాఖ. టూవీలర్లు, త్రీవీలర్లకు 80 శాతం, బస్సులకు 90 శాతం, కార్లు, హెవీ మోటార్ వెహికిల్స్‌కు 60 శాతం డిస్కౌంట్ ఇచ్చింది. పెండింగ్ చలాన్లకు రాయితీ ఇవ్వడంతో దొరికిందే ఛాన్స్ అని... ఆలస్యం చేయకుండా చలానాలు కట్టేస్తున్నారు వాహనదారులు. ఎప్పటినుంచో కట్టకుండా పెట్టుకున్న చలానాల డబ్బు కూడా చల్లించేస్తున్నారు. వాహనదారుల నుంచి భారీగా స్పందన రావడంతో... డిస్కౌంట్ ఆఫర్ ప్రకటించిన రెండు రోజుల్లోనే రూ.10కోట్లు వసూలు అయినట్టు ప్రకటించారు. డిసెంబర్ 28వ తేదీ రాత్రి.... అంటే గురువారం రాత్రి 10:30 గంటల వరకు రాష్ట్రవ్యాప్తంగా 9.80 లక్షలకు పైగా చలాన్లు క్లియర్

మిగతా 2వ పేజీలో...

విద్యార్థి బ్యాగులో పాము

స్థానికుల చేతిలో హతమైన సర్పం

3లో

తెలంగాణలో పెరిగిన క్రైమ్



డీజీపీ రవి గుప్తా

హైదరాబాద్, ప్రభాతసూర్యుడు : తెలంగాణ పోలీసు శాఖ వార్షిక నివేదిక ను డీజీపీ రవి గుప్తా శుక్రవారం విడుదల చేసారు. డీజీపీ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాం. పోలీసులు , మీడియా సహకారం తో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎన్నికలు పూర్తి చేశామని అన్నారు. గత ఏడాది తో 8.97% పోలిస్తే రాష్ట్ర వ్యాప్తంగా క్రైమ్ రేట్ పెరిగింది. ఈ ఏడాది 2, 13, 121 కేసులు నమోదు చేశాము. గత ఏడాది తో పోలిస్తే ఈ ఏడాది సైబర్ క్రైమ్ నేరాలు భారీగా పెరిగాయి. గత ఏడాది తో పోలిస్తే

మిగతా 2వ పేజీలో...

పెట్రోల్ తగ్గుముఖం!

- కేంద్ర సర్కారు ప్రయత్నం
- నూతన సంవత్సర వేళ ప్రజలకు శుభకరం

హైదరాబాద్, ప్రభాతసూర్యుడు : వాహన చోదకులకు గుడ్ న్యూస్. ఇంధన ధరలు భారీగా తగ్గే అవకాశం ఉంది. 2024లో లోక్‌సభ ఎన్నికలు రానున్న విషయం తెలిసిందే. ఈ ఎన్నికలకు ముందే పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గే అవకాశం ఉంది.. ఇంధన ధరల్లో భారీ కోత ఉంటుందని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ వర్గాలు తెలిపాయి. పెట్రోల్ ధరపై రూ.10 వరకూ తగ్గే అవకాశం ఉందని వెల్లడించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు తగ్గుముఖం పట్టాయి. మే 2022లో కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్‌పై సెంట్రల్ ఎక్సైజ్ డ్యూటీని లీటరుకు వరుసగా రూ.8, రూ.6 తగ్గించింది. ప్రస్తుతం ఢిల్లీలో లీటర్ పెట్రోల్ రూ.96.72కు విక్రయిస్తుండగా, డీజిల్ రూ.89.62గా ఉంది. ముంబైలో లీటరు పెట్రోల్ రూ.106.31, డీజిల్ రూ.94.27గా ఉంది. రాజ్యసభలో ఓ ప్రశ్నకు సమాధానంగా.. పెట్రోలియం శాఖ మంత్రి చమురు

మిగతా 2వ పేజీలో...

కాంగ్రెస్‌కు ధనరాశులు

- క్రౌడ్‌ఫండింగ్‌కు రూ.8కోట్లు
- తెలంగాణ నుంచే ఎక్కువ
- పార్టీ ఆవిర్భావ వేళ ధారాళంగా విరాళాలు

హైదరాబాద్, ప్రభాతసూర్యుడు : కాంగ్రెస్ పార్టీ చేపట్టిన క్రౌడ్ ఫండింగ్ కు అన్యూహ స్పందన వస్తోంది. దేశవ్యాప్తంగా ప్రజలు విరాళాలు ఇస్తున్నారు. డొనేట్ ఫర్ దేశ్ పేరుతో ప్రారంభించిన క్రౌడ్ ఫండింగ్ కార్యక్రమానికి ఇప్పటి వరకు ఎనిమిదిన్నర కోట్లు ఇచ్చారు. అయితే టాప్‌ప్లేస్‌లో తెలంగాణ నిలిచినట్లు కాంగ్రెస్ పార్టీ వర్గాలు వెల్లడించాయి. గురువారం వరకు ఒక్క తెలంగాణ నుంచే కోటి 38 లక్షల విరాళం వచ్చినట్లు కాంగ్రెస్ పార్టీ క్రౌడ్‌ఫండింగ్ డొనేషన్ డాష్ బోర్డు వెల్లడించింది. ఈ నెల 18 నుంచి కాంగ్రెస్ డొనేట్ ఫర్ దేశ్ పేరుతో విరాళాలను సేకరిస్తోంది. అన్ని ప్రాంతాల ప్రజలు ఆన్‌లైన్‌లో విరాళాలు చెల్లిస్తున్నారు. ఇప్పటివరకు రూ.8,57,71,985 వచ్చాయి. అందిన విరాళాలను

మిగతా 3వ పేజీలో...

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

యాచారం పెంటయ్య కుటుంబానికి ఆర్థిక సహాయం

యాచారం - ప్రభాత సూర్యుడు : యాచారం మండల పరిధిలోని తాడిపర్తి గ్రామానికి చెందిన యాచారం పెంటయ్య అనారోగ్యంతో మరణించాడు. ఆ కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చి 5 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. శశికళ మాట్లాడుతూ గ్రామంలో ఎవరికి ఏ ఆపద వచ్చిన తన సహాయ సహకారాలు ప్రజలకు ఎల్లప్పుడూ ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు బైకని మల్లేష్, కార్యదర్శి పొలమోని పాండు, సీనియర్ నాయకులు పరికిషన్ రెడ్డి, దార అంజయ్య, జోగు సత్తయ్య, ధార నరసింహ, మల్లారి, సంజీవ, యూత్ అధ్యక్షుడు అనిల్ గౌడ్, నీలం రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మరో మైలురాయిని అధిగమించిన గురునానక్ విద్యాసంస్థలు

ఇబ్రహీం పట్నం - ప్రభాత సూర్యుడు : ఇబ్రహీంపట్నం సమీపంలోని గురునానక్ కళాశాలలో హోమియోపతిక్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ మొదటి బ్యాచ్ విద్యార్థులకు శుక్రవారం వైట్ కోట్ వేడుకను విద్యార్థుల తల్లితండ్రుల సమక్షంలో యాజమాన్యం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. డాక్టర్ శ్రీకాంత్ అధ్యక్షతన విద్యార్థులకు ప్రమాణ స్వీకారం చేశారు. విద్యాసంస్థల వైస్ చైర్మన్ శ్రీ గగన్ దీప్ సింగ్ కోహ్లీ ముఖ్య అతిధిగా పాల్గొని. విద్యార్థులకు తెల్లటి కోటు , స్టెతస్కోప్‌తో అందిస్తూ విద్యార్థులు భవిష్యత్తులో మంచి డాక్టర్లుగా ఎదగాలని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ వారు చదివిన కళాశాలకు మంచి పేరును తీసుకు రావాలని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్య సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ హెచ్ ఎస్ సైని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ. ఇప్పటి ఫార్మా రంగంలో సామాన్య ప్రజలు కు కావలిసిన మందులు కొనాలంటే పెనుబారం అవుతుంది . పేద మధ్య తరగతి వాళ్లకు మందులు కొనుగోలు మొత్తం చెల్లిచే స్థోమత లేక వారు హోమియో మందులు వాడుతున్నారని ఇది చాలా మంచి పరిణామమని చెప్తూ భవిష్యత్తులో మీరంతా మంచి డాక్టర్లుగా ఎదిగి ప్రలకు మంచి వైద్యాన్ని అందించాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వి రేఖ, హోమియోపతి కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రేణుక బీ వై , డాక్టర్ శ్రీకాంత్ ,డాక్టర్ కె వెంకట రావు, డైరెక్టర్ డాక్టర్ పి పార్థసారథి ,జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కులకర్ణి. డాక్టర్ వాసంతి.కే పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనంను ఢీకొట్టిన లారీ



మహిళ మృతి.. మరొకరి పరిస్థితి విషమం

ఇబ్రహీం పట్నం – ప్రభాత సూర్యుడు : ఇబ్రహీంపట్నం కేంద్రంలో సాగర్ హైవే బస్ స్టాప్ సమీపంలోని శుక్రవారం ఉదయం10:30 గంటల సమయంలో రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఇబ్రహీంపట్నం వడ్డెర బస్తికి చెందిన భార్యాభర్తలు వరికుప్పల ఎల్లమ్మ 55 సంవత్సరాలు, ఆమె భర్త వరికుప్పల కిష్టయ్య 60 సంవత్సరాలు,ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తుండగా. అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న లారీ బైకును బలంగా ఢీ కొట్టడంతో మహిళ జారి పడగా లారీ ఆమె పైనుండి వెళ్లి అమె అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ప్రమాదంలో భర్త కిష్టయ్యకు తీవ్ర గాయాల పాలయ్యారు. ఎల్లమ్మ కుమారుడు చంటి ఫిర్యాదు మేరకు పోలీసులు మృతదేహానికి పంచనామ నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సర్కిల్ ఇన్స్పెక్టర్ గోవింద్ రెడ్డి తెలిపారు.

తెలంగాణలో పెరిగిన క్రైమ్

మొదటిపేజీ తరువాయి..

17. 59% సైబర్ క్రైమ్ నేరాలు పెరిగాయి. ఈ ఏడాది జీరో ఎఫ్ఐఆర్ లు 1108 నమోదు చేశాము. ఈ ఏడాది ఐపిసి కింద కేసులు 138312 కేసులు నమోదు అయ్యాయనిఅన్నారు. రేప్ కేసులో 73 కేసుల్లో 84 మందికి జీవిత ఖైదీ శిక్షలు పడ్డాయి. ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా 1360 డ్రగ్ కేసులు ఔఆఖూ కింద కేసులు నమోదు, గత ఏడాది తో పొలిస్తే ఈ ఏడాది 15.6 శాతం డ్రగ్స్ కేసులు పెరిగాయి. 25260 కేజీల గంజాయి , 1240 గంజాయి మొక్కలను సీజ్ చేసి 2583 మందిని అరెస్ట్ చేశాము. ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ,ఎస్టీ కేసులు 1877 కేసులు నమోదు అయ్యాయని వివరించారు.

పెట్రోల్ తగ్గుముఖం!

మొదటిపేజీ తరువాయి..

ధరలను తగ్గించనున్నట్టు ప్రకటించారు. మోదీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు.. చమురు సంస్థలను లాభాల బాటలో నడిపించాయి. దీంతో లీటర్‌పై రూ.10 వరకూ లాభం వస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో దేశీయ చమురు సంస్థలు నష్టాల్లో ఉన్నప్పుడు కేంద్రం రాయితీలు, ఆర్థిక సాయం అందించి అండగా నిలిచింది. ప్రస్తుతం లాభాలు వస్తుండటంతో ఇక ఇంధన ధరలను తగ్గించినా కూడా ఇబ్బంది లేదని కేంద్రం భావిస్తోంది. ఈ క్రమంలోనే నూతన సంవత్సర కానుకగా పెట్రోల్ ధరలను తగ్గించాలని కేంద్రం యోచిస్తోంది.

గేరు మార్చిన 'కారు'!

మొదటిపేజీ తరువాయి..

ఉంటే పదేపదే ఇలా వ్యాఖ్యలు చేసి ఉండే వారు" అని కవిత అభిప్రాయపడ్డారు. కేవలం ఎన్నికలప్పుడే పనిచేసే రాహుల్ గాంధీని అందరూ ఎన్నికల గాంధీ అని పిలుస్తారని విమర్శించారు. దేశ ప్రజలకు రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలని, ఇండియా కూటమికి నేతృత్వం వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ జవాబుదారీగా ఉండాలని డిమాండ్ చేశారు. దేశానికి రాహుల్గాంధీ ఏం సందేశమిస్తున్నారని ప్రశ్నించారు. కార్మికుల పట్ల గౌరవం ఉందని, హిందీ మాట్లాడే రాష్ట్రాలను అవమానించరాదని, హిందూ వ్యతిరేకి కాదని రాహుల్ చెప్పాలని డిమాండ్ చేశారు.

కాళేశ్వరం కట్టుకథ చెప్తాం!

మొదటిపేజీ తరువాయి..

ప్రాజెక్టులకు బిల్డర్లదే బాధ్యత అన్నారు. ఎల్అండ్‌టీ కంపెనీ ప్రతినిధులను కూడా సమీక్ష కోసం సమావేశానికి పిలిచామని చెప్పారు. ప్రాజెక్టులు ఎవరు కట్టినా వాటి నాణ్యతకు బాధ్యత వహించాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఇంత భారీ ప్రాజెక్టులో జరిగిన అక్రమాలను బయటపెడతామన్నారు. మేడిగడ్డలో పిల్లర్లు కుంగిపోవడంతో నీటిని నిల్వ చేసుకోలేక పోతున్నారు. నదిలో నీటిని దిగువకు విడుదల చేయాల్సిందేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నా రంలో వచ్చే నీటి బుగ్గలను కూడా మంత్రులు క్షేత్రస్థా యిలో పరిశీలించనున్నారు. నిర్మా ణం, డిజైన్‌లో లోపాలుంటే పరిశీలి స్తామని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. డిజైన్‌లో లోపా లు న్నాయా, నిర్మాణ సంస్థలో లోపాలున్నాయా అనే దానిపై కూడా స్పష్టత రానుంది. కాళేశ్వరం నిర్మించిన అధికారులతో ఎల్అండ్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. పవర్ పాయింట్ తర్వాత కుంగిపో యిన ప్రాంతాన్ని పరిశీలిస్తారు. మరోవైపు ప్రాజెక్టులో పిల్లర్లు కూలిన ప్రాంతాన్ని సందర్శించేందుకు మీడియాను అనుమతించాలని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.

వైఫల్యాలను ఎత్తి చూపుతం :

కాళేశ్వరం ప్రాజెక్టు వైఫల్యాన్ని ప్రజలకు తెలియజేయాలని ప్రభుత్వం భావిస్తోందని ఆయన స్పష్టం చేశారు. నిర్మాణ లోపాలను ప్రజలకు వివరించడమే తమ ఉద్దేశమన్నారు. సాగునీటి ప్రాజెక్టులపై అసెంబ్లీలో శ్వేతపత్రం విడుదల చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తోంది. ఆర్థిక పరిస్థితి, కరెంటుపై శ్వేతపత్రాలు విడుదల చేసినట్లే కాంగ్రెస్ పార్టీ కూడా లక్ష కోట్ల సాగునీటి ప్రాజెక్టుల విషయాన్ని ప్రజల ముందుంచాలని భావిస్తోంది. మేడిగడ్డ వైఫల్యానికి తాము బాధ్యులం కాదన్న ఎల్అండ్‌టీ ప్రకటనపై వాస్తవాలను ప్రజల ముందు ఉంచుతామని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మేడిగడ్డలో పర్యటించిన రాహుల్ గాంధీ సమక్షంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తామన్నారు మంత్రి శ్రీధర్ బాబు. గత ప్రభుత్వ హయాంలో మేడిగడ్డ ఘటనలో కుట్రపూరితంగా కేసులు పెట్టారని, వాస్తవ పరిస్థితిని తెలుసుకున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. వాస్తవ పరిస్థితులను తెలంగాణ ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై అప్పటి ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయలేదని ప్రశ్నించారు. కేటీఆర్ చిన్న చిన్న విషయాలు, ఆ విషయాలు బయటకు తీసి ప్రజలందరి ముందు పెడతాము. ఏం జరిగిందో ప్రజలే నిర్ణయిస్తారని అన్నారు.

ఖజానాకు చలానా..!

మొదటిపేజీ తరువాయి..

అయ్యాయి. అత్యధికంగా హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 3.84 లక్షల చలాన్లకు రూ.2.90 కోట్లు, సైబరాబాద్ పరిధిలో 2.2 లక్షల చలాన్లకు రూ.1.90 కోట్లు, రాచకొండ కమిషనరేట్ పరిధిలో 97వేల చలాన్లకు రూ.81 లక్షలు వాహనదారుల నుంచి వసూలు చేశారు. చలాన్ సైట్‌పై తాకిడి పెరగడంతో సర్వర్లు కూడా మొరాయిస్తున్నాయి. దీన్ని బట్టి.. పెండింగ్ చలానాల పేమెంట్లు కట్టేందుకు ఎంత స్పందన వస్తుందో అర్థమవుతోంది.

గతేడాది 300 కోట్ల ఆదాయం

గత ఏడాది కూడా పెండింగ్ చలానాల వసూళ్ల కోసం ఇలాంటి ఆఫర్‌నే ప్రకటించారు. అప్పుడు కూడా పెండింగ్ చలాన్ల ద్వారా ఏకంగా 300 కోట్ల ఆదాయం సమకూరింది. కాగా.. ఈ ఏడాది కూడా సుమారు 2 కోట్ల చలానాలు పెండింగ్‌లో ఉండటంతో.. మరోసారి పెండింగ్ చలాన్లపై డిస్కౌంట్ ప్రకటించారు. డిసెంబర్ 26ను ఈ ఆఫర్ ప్రారంభించారు. జనవరి 10వ తేదీ వరకు డిస్కౌంట్‌తో పెండింగ్ చలానాలు కట్టే అవకాశాన్ని ట్రాఫిక్ పోలీసులు కల్పించారు. ఇంకెందుకు ఆలస్యం.. మీకు చలానాలు ఉంటే ఆలస్యం చేయకండి.. మంచి కాలం మించినా దొరకదు.. త్వరపడండి... పెండింగ్ చలానాల పేమెంట్లు క్లియర్ చేసుకోండి. అయితే... ఒక్కమాట పెండింగ్ చలాన్లపై మాత్రమే ఈ ఆఫర్ ప్రకటించారు. అంటే ఈ డిస్కౌంట్ కేవలం డిసెంబర్ 25వ తేదీకి ముందు పడిన చలానాలకు మాత్రమే వర్తిస్తుంది. ఆ తర్వాత పడిన చలానాలు 100 శాతం కట్టాల్సిందే అని ట్రాఫిక్ పోలీసులు స్పష్టం చేస్తున్నారు.

అభివృద్ధి ధ్యేయంగా ముందుకు సాగుతాం

ఎమ్మెల్యే రోహిత్

చిన్న శంకరంపేట్ -ప్రభాత సూర్యుడు : గత ప్రభుత్వం దోచుకోవడం దాచుకోవడం తప్ప అభివృద్ధి ఏమి జరగలేదని ప్రస్తుత ప్రభుత్వం అభివృద్ధి ధ్యేయంగా ప్రణాళికతో ముందుకు సాగుతుందని చిన్న శంకరం పేట రైతు వేదిక సభలో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఉద్దేశించి మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. అవినీతి రహిత పాలన గా ముందుకు సాగుతాననీ , ఎన్నికల సమయంలో మాటలను పక్కనపెట్టి నియోజకవర్గ అభివృద్ధి వైపు అందరం కలిసికట్టుగా పని చేయాలని వారు అన్నారు. అనంతరం కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను మండలంలోని డెబ్బై రెండు మంది లబ్ధిదారులకు అందజేశారు. స్థానిక సర్పంచ్ రాజిరెడ్డి మాట్లాడుతూ మెదక్ నియోజకవర్గం పది సంవత్సరాలలో అభివృద్ధి శూన్యమని కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఆరు గ్యారంటీలతో ఖచ్చితంగా నియోజకవర్గ ప్రజలు అభివృద్ధి చెందడం ఖాయమని ఇక్క డికి విచ్చేసి లబ్ధిదారులకు చెక్కులు అందజేసినందుకు ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు శివకుమార్, జడ్పిటిసి మాధవి రాజు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు సత్యనారాయణ గౌడ్, స్థానిక ఉపసర్పంచ్ జీవన్, మాజీ ఏఎంసీ చైర్మన్ గంగా నరేందర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ప్రభాకర్ ముదిరాజ్ ,ఆవుల గోపాల్ రెడ్డి, శ్రీమన్ రెడ్డి, మేడి శ్రీమన్, మైనంపల్లి రంగారావు, మనోజ్ కుమార్, సుధాకర్ ,బందెల సాయిలు వివిధ గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

టిఎస్ యుటిఎఫ్ యాచారం మండల నూతన కమిటీ ఎన్నిక

- టీఎస్ యుటిఎఫ్ యాచారం మండల అధ్యక్షులుగా సలవాల నరసింహ
- ప్రధాన కార్యదర్శి పి.అంజయ్య

యాచారం - ప్రభాత సూర్యుడు : శుక్రవారం టిఎస్ యుటిఎఫ్ యాచారం మండల శాఖ ఆధ్వర్యంలో మండల మహాసభను జడ్పీహెచ్ఎస్ యాచారం ఉన్నత పాఠశాలలో సమావేశం నిర్వహించారు. ఎన్నికల పరి శీలకులుగా జిల్లా అధ్యక్షులు గోపాల్ నాయక్ ఎన్నికల అధికారి జిల్లా కార్యదర్శి కిషన్ చావన్ హాజరయ్యారు. రాష్ట్ర కార్యదర్శి గాలయ్య ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎన్నుకున్నారు. నూతన కమిటీ టీఎస్ యుటిఎఫ్ యాచారం మండల అధ్యక్షులుగా సలవాల నరసింహ, ప్రధాన కార్యదర్శి పి అంజయ్య , ఉపాధ్యక్షులుగా ఏ ధన రాజ్, మహిళ ఉపాధ్యక్షురాలుగా బి.అన్నపూర్ణ, కోశాధికారి కే జంగయ్య, జిల్లా కౌన్సిలర్ మోతిలాల్ ,శ్రీనివాస నాయక్, ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో మంచాల మండలం అధ్యక్ష కార్యదర్శిలు బాలు నాయక్ అజ్మత్ ఖాన్ మంచాల మండల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

ఐదో తరగతి విద్యార్థి బ్యాగులో కట్లపాము

స్థానికుల చేతిలో హతమైన సర్పం

ఖమ్మం, ప్రభాతసూర్యుడు : ఖమ్మం జిల్లా తల్లాడ మండలం తెలగవరం ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి విద్యార్థి వారాల విక్రమ్ బ్యాగులో కట్లపామును గుర్తించి స్థానికులు చంపేశారు. వారాల విక్రమ్ ప్రతిరోజు లాగానే ఇంటి నుంచి బ్యాగు తీసుకొని పాఠశాలకు వచ్చాడు. పాఠశాలలో ప్రార్థన అనంతరం తరగతి గదిలోకి వచ్చి బ్యాగులో నుంచి పుస్తకాలు తీయబోగా బ్యాగులో పాము కనిపించింది. విద్యార్థి విక్రమ్ భయపడి ప్రధానోపాధ్యాయుడు ఆర్.సాయిరాంకు తెలియజేయగా హెచ్ఎం విద్యార్థులను గదిలో ఉంచి బ్యాగును బయటకు తీసుకువచ్చి చూడగా పాము కనిపించింది.స్థానికుల సహాయంతో పామును చంపడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఇంటి నుంచి పాఠశాలకు భుజంపై బ్యాగును వేసుకొని వచ్చినా పాము బయటికిరాకపోవడంతో పెనుప్రమాదం తప్పింది.

జనాలు వెంటబడి తరుముతరు!

మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

నల్లగొండ, ప్రభాత సూర్యుడు : తెలంగాణ ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కు.. హామీల అమలు చేతకాక అయోమయంలో పడుతున్నారని సూర్యాపేట ఎమ్మెల్యే మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి అన్నారు. అడ్డగోలు హామీలిచ్చి.. ప్రజాపాలన పేరుతో తప్పించుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారన్నారు. గతంలో ఏ అప్లికేషన్లు లేకుండా లబ్ధిదారులను ఎంపిక చేసామని.. తమ హయాంలో దళారి వ్యవస్థ లేకుండా ఆన్లైన్ సిస్టం పెట్టామన్నారు. 6 గ్యారంటీల దరఖాస్తు ఫారాలు అసంబద్ధంగా ఉన్నాయనీ.. కౌలు రైతులను పాస్ పుస్తకం నంబర్లు అడుగుతున్నారనీ.. వారి హయాంలో ఎఫ్ఐఆర్ వివరాలు లేకుండా ,రికార్డులు లేకుండా చేసి ఇవాళ ఉద్యమకారులను కేసుల వివరాలు అడుగుతున్నారనీ మండిపడ్డారు. తెలంగాణ ప్రజలు మీ మోసాలను ఇప్పుడిప్పుడే గుర్తిస్తున్నారనీ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే ప్రజలు వెంటపడి తరముతారని జగదీష్ రెడ్డి అన్నారు. దమ్ముంటే నల్లగొండ జిల్లాకు మేం చేసిన దాంట్లో.. పది శాతం చేయాలని సవాల్ ఆయన మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి లకు సవాల్ విసిరారు.

ఘోర రోడ్డు ప్రమాదం

భార్య మృతి, భర్తకు తీవ్రగాయాలు

రంగారెడ్డి, ప్రభాత సూర్యుడు : ప్రజాపాలన దరఖాస్తు చేసేందుకు ఇంటి నుండి బయలుదేరిన దంపతులు లారీ చక్రాలకు బలైపోయారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం సాగర్ రహదారిపై బైక్‌పై వెళుతున్న దంపతులను లారీ వెనక నుండి ఢీ కొట్టింది. ఘటనలో ఎల్లమ్మ(60) అక్కడిక్కడే మృతి చెందగా భర్త కిష్టయ్యకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డబ్బులు అడిగితే చెప్పండి

ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి

పాలకుర్తి, ప్రభాత సూర్యుడు : ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారింటిల కోసం అర్హులైన అందరూ దరఖాస్తులు చేసుకోవాలనీ పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డిఅన్నారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం పత్తెప్పురం గ్రామంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజాపాలన అభయహస్తం అరు గ్యారింటిల దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీ రెడ్డి ప్రారంభించారు. .అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన అందరూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటిల సంక్షేమ పథకాల కొరకు దరఖాస్తులు చేసుకోవాలనీ అర్హులైన అందరికీ ఆరు గ్యారింటిలు లబ్దిపొందుతారని అర్హులైన వారు మాత్రమే దరఖాస్తులు చేసుకోవాలనీ ఎవరైన అధికారులు కానీ లీడర్లు కానీ ఈ పథకం కొరకు డబ్బులు అడిగితే ఇయ్యకూడదని ఎవరైన డబ్బులు అడిగితే నా దృష్టికి తీసుకు వస్తే వారిపై చర్యలు తీసుకుంటానని అన్నారు.

ఐటీ మంత్రికి ఘన స్వాగతం

కాళేశ్వరం, ప్రభాత సూర్యుడు : ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మొట్టమొదటి సారిగా కాళేశ్వరం గ్రామానికి విచ్చేసిన సందర్భంగా కాళేశ్వరం గౌడ సంఘ నాయకులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో కుల పెద్దలు కొండ్ర శ్రీనివాస్‌గౌడ్, పోన్నం లింగయ్య గౌడ్, కొండ్ర రాజబాబు గౌడ్, కొండ్ర సడవలి గౌడ్, గంట వెంకట స్వామి, తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ లక్ష్యం.. ప్రతి ఇంటికి సంక్షేమం..

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

మంచాల - ప్రభాత సూర్యుడు : ప్రజా పాలనను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలను అందించాడమే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రజా పాలన కార్యక్రమాన్ని ప్రారంభించిందని ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు.

శుక్రవారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం మంచాల్ మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ, ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా ప్రజా పాలన కార్యక్రమం ప్రవేశపెట్టి అభయ హస్తం గ్యారంటీల అమలుకు శ్రీకారం చుట్టిందన్నారు. జనవరి 6వ తేదీ వరకు ప్రతి గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీలలోని ప్రతి వార్డులలో సదస్సులు నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. మహాలక్ష్మి, రైతు భరోసా, చేయూత, గృహ జ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాలకు దరఖాస్తూ చేసుకోవచ్చని అన్నారు. ప్రజలు సమర్పించిన దరఖాస్తులను పరిశీలించి అర్హులైన లబ్దిదారులకు సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. ఇప్పటికే ఆర్టీసీ బస్సులలో మహిళలు ఉచిత ప్రయాణం, ఆరోగ్యశ్రీ పరిమితి రూ.10 లక్షలకు పెంపు హామీని నెరవేర్చామని, మిగిలిన గ్యారంటీలు అమలు చేస్తామన్నారు. మహిళలకు అండగా ఉండేందుకు ప్రభుత్వం అర్హులైన వారికి ఇండ్ల స్థలాలు మంజూరు చేస్తామని, స్థలాలు ఉన్నవారికి ఇండ్లు కట్టిస్తామని తెలిపారు. 200 యూనిట్ల ఉచిత కరెంటును, రైతు భరోసా క్రింద ఎకరాకు ఏడాదికి 15000 అందించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డులలో ప్రజా పాలన కార్యక్రమం నిర్వహించి అర్హులైన లబ్ధిదారుల నుండి దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందని అన్నారు. చివరి వరుసలో ఉన్న ప్రతి పేదవారికి సంక్షేమ పథకాలు అందించేందుకు గ్రామ సభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. ఈనెల 28 నుండి జనవరి 6వ తేదీ వరకు ప్రజా పాలన గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజా పాలన కార్యక్రమంలో కుటుంబం నుండి ఒకరు వచ్చి దరఖాస్తు చేస్తే సరిపోతుందని, అన్ని పథకాలకు ఒక దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. సందేహాల నివృత్తికి హెల్ప్ డెస్క్ లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పెన్షన్లు పొందుతున్న వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని, కొత్తగా పెన్షన్లు పొందాలనుకునే వారు మాత్రమే దరఖాస్తు చేయాలని అన్నారు. ఏదేని కారణం వల్ల గ్రామ సభలో దరఖాస్తు చేసుకోలేని వారు జనవరి 6వ తేదీ వరకు తమ దరఖాస్తులను గ్రామ పంచాయతీ కార్యాలయంలో అందజేయవచ్చని ప్రతిష్టాత్మకంగా దరఖాస్తుతో పాటు ఆధార్, రేషన్ కార్డు జిరాక్స్ ప్రతులను జత చేయాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ప్రజా ప్రతినిధులు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రజల నుండి దరఖాస్తులను శాసన సభ్యులు సేకరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపిపి నర్మద,మంచాల్ ఎంపీడీఓ, శ్రీనివాస్, సంబంధిత అధికారులు, లబ్దిదారులు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ధనరాశులు

మొదటిపేజీ తరువాయి..

ఏ రోజు కారోజు కాంగ్రెస్ పార్టీ వెబ్‌సైట్‌లో అప్ డేట్ చేస్తోంది. అత్యధిక విరాళాలు అందజేసిన రాష్ట్రాల్లో తెలంగాణ అగ్రస్థానంలో ఉంది. 28వ తేదీ వరకు రూ.1,38,46,450 అందినట్టు కాంగ్రెస్ పార్టీ క్రౌడ్‌ఫండింగ్ డొనేషన్ డాష్‌బోర్డు తెలిపింది. తెలంగాణ మొదటి స్థానంలో ఉంటే మహారాష్ట్ర రెండో స్థానంలో నిలిచింది. ఆ రాష్ట్రం నుంచి రూ.1,07,62,909 అందాయి. రాజస్థాన్ నుంచి రూ. 95,76,278, హర్యానా నుంచి రూ.86.98 లక్షలు వచ్చాయి. యూపీ రూ.60.76 లక్షల విరాళంతో ఐదో స్థానంలో నిలించింది. విరాళాల్లో తెలంగాణ టాప్ ప్లేస్ లో నిలిచినప్పటికీ...తక్కువ మంది ఎక్కువ డబ్బు చెల్లించినట్లు తెలుస్తోంది. ఎక్కువ మంది విరాళాలిచ్చిన రాష్ట్రంగా రాజస్థాన్ తొలి స్థానంలో నిలిచింది. సిక్కిం రాష్ట్రం నుంచి కేవలం 2,301 రూపాయలు మాత్రమే వచ్చాయి. దేశంలోని బలహీన వర్గాల హక్కులను కాపాడేందుకు, సమాజంలోని అసమానతలను అధిగమించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు కాంగ్రెస్ పార్టీ క్రౌండ్ ఫండింగ్ సేకరిస్తున్నట్లు వెల్లడించింది. సంపన్న వర్గాలకు మద్దతుగా ఉన్న ప్రభుత్వానికి వ్యతిరేకంగా బలమైన ప్రతిపక్షంగా నిలవాలన్న కాంగ్రెస్ నిబద్ధతకు నిదర్శమని స్పష్టం చేసింది. 138 సంవత్సరాల చరిత్ర కలిగిన పార్టీకి కొన్నేళ్లుగా విరాళాలు రావడం భారీగా తగ్గింది. 2024 పార్లమెంటు ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఆ పార్టీ ఈ ప్రచార, నిధుల సమీకరణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తోంది. దేశ వ్యాప్తంగా కార్యకర్తలు, నాయకులు, అభిమానులు, ప్రజల నంచి రూ.138, రూ.1,380, రూ.13,800... చొప్పున విరాళాలు సేకరిస్తోంది. 18 ఏళ్లు పైబడిన భారతీయులెవరైనా రూ.138 మొదలు రూ.1380, రూ.13,800 ఆపై ఎంతైనా విరాళం ఇవ్వవచ్చు. 138 ఏళ్ల పార్టీ ప్రయాణాన్ని ఇది గుర్తుచేస్తుందని హస్తం పార్టీ వెల్లడించింది. ఎక్కువ మొత్తం ఇవ్వాలనుకుంటే...కాంగ్రెస్ అఫిషియల్ వెబ్ సైట్‌లోకి వెళ్లి దాతలు విరాళాలను ఇవ్వవచ్చు. ఎక్కువ మొత్తం ఇవ్వాలనుకునే వారు వెబ్‌సైట్‌లోకి వెళ్లి రాబిష్ట్రవతీ ఆప్షన్ ఎంచుకోవచ్చు. పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, జిల్లా, రాష్ట్ర కాంగ్రెస్ కమిటీల అధ్యక్షులు, ఏఐసీసీ సభ్యులు కనీసం రూ.1,380 చొప్పున విరాళం ఇవ్వాలని పార్టీ సూచించింది. ఇది దేశంలోనే అతి పెద్ద క్రౌడ్ పుల్లింగ్ ఫండ్ క్యాంపెయిన్ గా నిలవనుంది.

భార్యను చితకబాదిన పోలీసు భర్త

అసిఫాబాద్, ప్రభాతసూర్యుడు : ప్రభుత్వ ఉద్యోగం ఉన్న ఆయన్ను పెళ్లి చేసుకుంటే అమ్మాయి జీవితం సుఖంగా ఉంటుందని భావించారు కుటుంబ సభ్యులు.. అందులోనూ ఆయనది పోలీస్ ఉద్యోగం, కావడంతో పెళ్లికి 20 లక్షలు కట్నం ఇచ్చి పెళ్లి చేశారు.. అయిన వేధింపులు తప్పలేదు.. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో విధులు నిర్వహిస్తున్న మాధవ్ రావు తన భార్యని విచక్షణ రహితంగా కొట్టడంతో ఆమెకు తీవ్ర గాయలయ్యి ఆస్పత్రి పాలయ్యింది. తన భార్యా అయన మౌనిక పై విచక్షణ రహితంగా దాడి చేశాడు. డబ్బులు విషయంలో పలు మార్లు గోడవపడ్డారు.కొడుకు ఫంక్షన్ కోసం 2లక్షల విషయంలో ఇద్దరి మధ్య వివాదం మరింత పెరిగింది, గ్రూప్స్ ప్రిపేర్ కోసం తన ఉద్యోగానికి ఆరు నెలలు సెలవు పెట్టున్నాడు.. ఆరు నెలలు నాకు జీతం రాదు కాబట్టి 6 నెలల రూం రెంట్ నువ్వ కట్టాలని భార్యను వేధించేవాడనీ,..మాధవరావు అక్రమ సంబంధం పెట్టుకున్నారని భార్య మౌనిక ఆరోపించింది. ఇంట్లో నిత్యావసర సరుకులు, బాబుకి పాలు డబ్బా కూడా తీసుకొచ్చే వాడు కాదని, ఇద్దరు మధ్య జరిగిన వాగ్వాదంలో కానిస్టేబుల్ మాధవ్ రావు తన భార్యను రాడ్ తో వీపు పై కొట్టడంతో ఆసుపత్రిలో చేరింది.. చివరకు మౌనిక పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసింది.



RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

జేడీయూ అధ్యక్షుడిగా నితీష్‌కుమార్

ఏకగ్రీవంగా ఎన్నిక

న్యూఢిల్లీ, ప్రభాతసూర్యుడు : జనతాదళ్ యునైటెడ్ అధ్యక్ష పగ్గాలను తిరిగి బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ తన చేతుల్లోకి తీసుకున్నారు. బీహార్ అధికార జేడీయూ అధ్యక్షుడిగా నితీష్ శుక్రవారంనాడిక్కడ జరిగిన పార్టీ జాతీయ ఎక్సిక్యూటివ్ సమాశంలో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇంతవరకూ జాతీయ అధ్యక్షుడిగా ఉన్న లలన్ సింగ్ రాజీనామా చేసిన కొద్ది సేపటికే ఆయన పార్టీ పగ్గాలు చేపట్టారు. బీహార్‌లో జేడీయూ భాగస్వామ్య పార్టీ అయిన లాలూ ప్రసాద్ యాదవ్ రాష్ట్రీయ జనతా దళ్‌కు(ఆర్జేడీ) లలన్ సింగ్ దగ్గర కావడం వల్లే ఆయనను తొలగించారనే ప్రచారం జరిగింది. దీనిపై సమావేశం పూర్తయిన వెంటనే మీడియా అడిగిన ప్రశ్నకు లలన్ సింగ్ ఆగ్రహం వ్యక్తం చేస్తారు. "ఆగ్రహమా? ఎందుకు ఆగ్రహం? నేనెందుకు ఆగ్రహం చెందాలి. ఈ మాట వినడం ఇదే మొదటిసారి" అని అన్నారు.

కర్నాటకలో భాష వివాదం

కర్నాటకలో వెలుగు చూసిన భాషా వివాదం దేశవ్యాప్తంగా కలకలం రేపుతోంది. కర్నాటకలో వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 నుంచి అన్ని వాణిజ్య సంస్థలు, దుకాణాల నామఫలకాల్లో 60శాతం కన్నడ అక్షరాలే ఉండాలని ఆ రాష్ట్ర సీఎం సిద్ధరామయ్య ఆదేశాలు జారీ చేశారు. 60 శాతం కన్నడ అక్షరాలు, 40 శాతం ఇతర భాషాల అక్షరాలతో నామఫలకాలు ఉండేలా ఆర్డినెన్స్ తీసుకురావాలని రాష్ట్ర సాంస్కృతిక శాఖ అధికారులను ఆదేశించారు. ఆర్డినెన్స్ సంబంధించిన నియమాలు రూపొందించాలని అధికారులకు సూచించారు. ఫిబ్రవరి 28లోగా అన్ని కంపెనీలు, సంస్థలు, ఇతర దుకాణాలు తమ నేమ్‌ప్లేట్‌లను మార్చుకోవాలని సిద్ధరామయ్య విజ్ఞప్తి చేశారు. కన్నడ భాషకు ప్రాధాన్యం ఇవ్వాలని వ్యాపారులంతా వీటిని తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. '60 శాతం కన్నడ' పేరుతో ఓ ఉద్యమం తెరమీదికి వచ్చింది. కర్నాటకలో వ్యాపారాలు నిర్వహించేవారు.. దుకాణాల ముందు ఇంగ్లీష్‌లో సైన్ బోర్డుల ఏర్పాటు చేయడంతో కన్నడ భాష అంతరించే ప్రమాదం ఉందంటూ కర్నాటక రక్షణ వేదిక ఆందోళనలకు దిగింది. వాణిజ్య వ్యాపార సంస్థల సైన్ బోర్డులపై '60శాతం కన్నడ' అక్షరాలే ఉండాలన్న నిబంధనను అమలు చేయాలని పట్టుబడుతోంది.కర్ణాటకలో భాషా వివాదం మరింత ముదిరింది. దుకాణాదారులు, ఇతర వ్యాపార సంస్థల సైన్ బోర్డులలో 60 శాతం వరకూ కన్నడ భాషనే వినియోగించాలన్న ఉద్యమం రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తోంది. కర్నాటక రక్షణ వేదిక సభ్యుల దాడులు పలు ప్రాంతాల్లో ఉద్రిక్తతలకు దారితీశాయి. అటు.. ఆందోళనకారుల తీరుపై ప్రభుత్వం సీరియస్ అయింది. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే ఊరుకునేదిలేదంటూ వార్నింగ్ ఇచ్చింది.కర్ణాటకలో వెలుగు చూసిన భాషా వివాదం దేశవ్యాప్తంగా కలకలం రేపుతోంది. '60 శాతం కన్నడ' పేరుతో ఓ ఉద్యమం తెరమీదికి వచ్చింది. కర్నాటకలో వ్యాపారాలు నిర్వహించేవారు.. దుకాణాల ముందు ఇంగ్లీష్‌లో సైన్ బోర్డుల ఏర్పాటు చేయడంతో కన్నడ భాష అంతరించే ప్రమాదం ఉందంటూ కర్నాటక రక్షణ వేదిక ఆందోళనలకు దిగింది. వాణిజ్య వ్యాపార సంస్థల సైన్ బోర్డులపై '60శాతం కన్నడ' అక్షరాలే ఉండాలన్న నిబంధనను అమలు చేయాలని పట్టుబడుతోంది. ఈ క్రమంలోనే.. నేమ్ బోర్డుల విషయంలో టీఏ నారాయణగౌడ ఆధ్వర్యంలో భారీ ఊరేగింపు నిర్వహించారు. అయితే.. బెంగళూరులోకర్నాటక రక్షణ వేదిక నిర్వహించిన ర్యాలీలు ఉద్రిక్తతకు దారితీశాయి. కెంపెగౌడ ఎయిర్‌పోర్ట్‌తోపాటు పలు ప్రాంతాల్లో రెచ్చిపోయిన ఆందోళనకారులు.. హోటళ్లు, దుకాణాలపై ఆంగ్లంలో ఉన్న సైన్‌బోర్డులను తొలగించి విధ్వంసం సృష్టించారు. ఈ ఏడాది అక్టోబర్‌లో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య చేసిన వ్యాఖ్యలు కన్నడవాదం అనే తేనెతుట్టను మరోసారి కదిపాయి. రాష్ట్రంలో ఉన్న ప్రతి ఒక్కరూ కన్నడ భాషను నేర్చుకోవాలని, అందరూ కన్నడిగులే అవ్వాలని తేల్చి చెప్పారు సిద్దరామయ్య. అంతకు ముందే కీలక ఉత్తర్వులు జారీ చేశారు. బెంగళూరు సిటీలో బిజినెస్ చేస్తున్న వాళ్లంతా నేమ్ బోర్డులపై కచ్చితంగా కన్నడ భాషలో రాయాలని, అందుకు కొంత ఖాళీ ఉంచాలని తేల్చి చెప్పింది ప్రభుత్వం. బెంగళూరు మున్సిపాలిటీ అధికారులు ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఆర్డర్ పాస్ చేసింది. బిజినెస్‌లకు సంబంధించిన నేమ్ బోర్డులలో 60% మేర కన్నడనే కనిపించాలనేది ఈ ఉత్తర్వులలో సారాంశం. వచ్చే ఏడాది ఫిబ్రవరిలోగా సిటీ అంతటా ఇది అమలవ్వాలని రూల్ పెట్టారు. కన్నడవాదులంతా ఈ నిబంధన పెట్టినందుకు ప్రభుత్వాన్ని పొగిడారు. కానీ...రూల్ పెట్టినంత వరకూ బాగానే ఉంది. అమలు చేయడంలోనే చాలా ఆలస్యం జరుగుతోంది. ఇప్పటికీ చాలా బోర్డులపై ఇంగ్లీష్ కనిపిస్తోంది. ఇది చూసి అసహనానికి గురైన కన్నడ సంఘాలు క్రమంగా ఆందోళనలు ఉద్ధృతం చేశాయి. "ఇచ్చిన ఉత్తర్వుల మాటేంటి" అంటూ నిలదీస్తున్నాయి. ప్రత్యేకంగా ఓ ప్రచారాన్నే మొదలు పెట్టింది. భారీ వాహనాల్లో బెంగళూరు రోడ్లపై తిరుగుతూ కన్నడకు అనుకూలంగా నినాదాలు చేస్తున్నారు. కన్నడ నేలపై ఉంటూ..ఇక్కడే ఉపాధి పొందుతున్నప్పుడు కన్నడ భాషను గౌరవించడానికి వచ్చిన ఇబ్బందేంటని ప్రశ్నిస్తున్నారు. నేమ్ బోర్డులను కన్నడ భాషలోనే పెట్టుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ వ్యవహారమే కాస్త అదుపు తప్పి ఆందోళనలకు కారణమైంది. కన్నడలో సైన్‌బోర్డులకు సంబంధించి బెంగళూరు నగర పాలక సంస్థ ఇచ్చిన ఆదేశాలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇక.. పరిస్థితి అదుపు తప్పడంతో పోలీసులు లాఠీఛార్జ్ చేసి ఆందోళనకారులను అడ్డుకున్నారు. ఆయా ఘటనల్లో పాల్గొన్నవారిని అదుపులోకి తీసుకున్నారు. కర్నాటక రక్షణ వేదిక నేతలను అరెస్ట్ కోర్టులో హాజరుపర్చగా.. 14 రోజుల రిమాండ్ విధించింది. కర్నాటక రక్షణ వేదిక ఆందోళనల నేపథ్యంలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్పందించారు. తాజా పరిస్థితులపై ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించిన ఆయన.. కర్నాటకలో సైన్ బోర్డులు, నేమ్‌ప్లేట్లలో 60 శాతం కన్నడలో ఉండాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఫిబ్రవరిలోగా మార్పులు చేయాలని షాపుల యజమానులను ఆదేశించామని చెప్పారు. ఉత్తర్వులు అమలయ్యేందుకు ఒక ఆర్డినెన్స్‌ను కూడా తీసుకొస్తామని తెలిపారు. అయితే.. రెచ్చిపోయి వ్యవహరిస్తే సహించేదిలేదన్నారు సీఎం సిద్ధరామయ్య. ఇక.. కన్నడ పరిరక్షణ పేరిట ఎవరైనా చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవడాన్ని ఉపేక్షించబోమన్నారు డిప్యూటీ సీఎం డీకే శివకుమార్. రాష్ట్ర భాషను కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కన్నడ కోసం పోరాడుతోన్న వారికి తాము వ్యతిరేకం కాదు.. వారిని గౌరవిస్తాం.. కానీ.. విధ్వంసానికి పాల్పడితే ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. అంతేకాదు ప్రజాస్వామ్యంలో ఎవరైనా నిరసన వ్యక్తం చేయొచ్చు.. నల్ల జెండాలతో ఆందోళన చేయొచ్చు.. ప్రభుత్వ ఉత్తర్వులు అమలు చేయాలని కోరవచ్చు.. కానీ.. చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదు.. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే ఉపేక్షించబోమని హెచ్చరించారు.

కాళేశ్వరంలో 38వేల కోట్లు మాయం

వరంగల్, ప్రభాతసూర్యుడు : కాళేశ్వరం మొత్తం ప్రపోజల్ అంచనా వ్యయం లక్షా 28 వేల కోట్లు అని నీటిపారుదల శాఖ అధికారులు స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఇప్పటివరకు రూ.93,800 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. కుంగిన మేడిగడ్డ బ్యారేజ్‌ను నలుగురు మంత్రులు పరిశీలించారు. ఈ సందర్భంగా కాళేశ్వరంపై నీటిపారుదల శాఖ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. పాలుమూరు ప్రాజెక్టుకు కూడా కాళేశ్వరం పేరుతో అప్పులు తీసుకొచ్చారని వెల్లడించారు. ఈ ప్రాజెక్టు మొదటి దశ పూర్తికావడానికి అదనంగా 15 వేల కోట్లుకు పైగా అవసరం పడిందన్నారు. ఏడాదిన్నర కాలంగా మూడు వేల కోట్లకు పైగా కాళేశ్వరం బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అక్టోబర్ 21 నాడు సాయంత్రం పెద్ద సౌండ్ వచ్చిందని, కుట్ర కోణంగా అనుమానంతో ఫిర్యాదు చేశామని ఇఎన్‌సి అధికారులు తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రతిపాదిత స్టోరేజ్ కెపాసిటీ 141 టిఎంసిలుగా ఉందని, ఇప్పటివరకు కాళేశ్వరం కింద 98,570 ఎకరాలు సాగు చేశామని పేర్కొన్నారు. మూడో టిఎంసి కోసం మరో 33400 కోట్లతో ప్రతిపాదన చేశామని వివరించారు. ఈ ప్రాజెక్టు నిర్మించాక ప్రధానంగా ఇచ్చింది స్థిరకరణ మాత్రమేనన్నారు. భూసేకరణ సమస్యలతో కొత్త ఆయకట్ట కష్టమేనని చెప్పారు. రెండు టిఎంసిల లిఫ్టింగ్‌కు కేవలం ఐదు వేల మెగావాట్ల కరెంట్ అవసరం వచ్చిందని, మూడో టిఎంసి పనులు చేస్తే మొత్తం 8450 మెగావాట్ల కరెంట్ అవసరం పడుతుందన్నారు. ఈ ఐదేళ్లలో కాళేశ్వరం నుంచి లిఫ్ట్ చేసి 173 టిఎంసిలు మాత్రమేనని, రెండు టిఎంసిల కెపాసిటీలకే 94 వేల కోట్లతో ప్రతిపాదన ఇచ్చామన్నారు. మూడు టిఎంసి కోసం మరో 33400 కోట్లతో ప్రతిపాదనలు తీసుకొచ్చామన్నారు. మేడిగడ్డ ప్రాజెక్టు కుంగిన పిల్లర్ల పరిశీలిన అనంతరం మంత్రులు మీడియాతో మాట్లాడారు. 'కాళేశ్వరం కంటే ప్రాణహితే ఉత్తమమైనది. మహారాష్ట్ర కొంత ముంపుతో ప్రాణహిత పూర్తి అయ్యేది. ప్రాజెక్టు వ్యయాన్ని రూ.80వేల కోట్లకు పెంచారు. కాళేశ్వరం కింద కొత్త ఆయకట్టుకు రూ.90 వేళ కోట్లు ఖర్చు చేశారు. మేడిగడ్డ కుంగడమే కాదు.. అన్నారం బ్యారేజీ కూడా డ్యామేజీ అయింది. ఇంకా సుందిళ్లను పరిశీలించాల్సి ఉందని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టినప్పుడు ఇంజినీర్ల సలహాలు మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ తీసుకున్నారా? లేక చీఫ్ ఇంజినీర్‌గా పని చేశారా? అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రశ్నించారు. మూడో టిఎంసి అవసరం లేదని, మూడో టిఎం సి కెసిఆర్ బంధువు కోసం చేశారని కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆరోపించారు. ఇంజినీర్లుగా సలహాలు ఇవ్వాలని కానీ వినకపోతే సెలవు పెట్టి పోవాలని సూచించారు. కొండ పోచమ్మ ఎప్పుడూ నిండుగా ఉంటుందని, ఫామ్‌హౌస్‌కు తప్పితే ఇతర పొలాలకు నీరు పోదని చురకలంటించారు. ఇంత ఖర్చు చేసినా ఎంత ఆయకట్టుకు నీరు వెళ్తోందో చెప్పడంలేదని మంత్రి చురకలంటించారు. ఫామ్ హౌస్ తప్ప ఇతర పొలాలకు నీరు పోదు. ఇంత ఖర్చు చేసినా ఎంత ఆయకట్టుకు నీరు వెళ్తోందని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో కీలకమైన మేడిగడ్డ బ్యారేజ్ డ్యామేజ్‌పై దృష్టి పెట్టిన ప్రభుత్వం వీలైనంత తొందరగా దాన్ని రిస్టోర్ చేయాలని భావిస్తున్నది. బ్యారేజీలోని ఏడవ బ్లాకులో 16-20 పిల్లర్లు దెబ్బతిన్నందున వాటిని పూర్తిగా ధ్వంసం చేసి కొత్త నిర్మాణం చేయాల్సిన అవసరం ఉన్నదన్న ప్రాథమిక నిర్ణయానికి వచ్చింది. ఇప్పుడున్న స్ట్రక్చర్ ఉపయోగానికి అనువుగా లేనందున కొత్తది కట్టడం అనివార్యమని ఇంజనీరింగ్ నిపుణులు అభిప్రాయపడ్డారు. ఇందుకోసం దెబ్బతిన్న పిల్లర్లను తొలగించడానికి, పక్కన ఉన్న బ్లాక్‌లకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు ఎలాంటి విధానాన్ని అనుసరించాలన్నదానిపై సాంకేతిక చర్చలు కంప్లీట్ అయ్యాయి.

ప్రజాభవన్‌లో ప్రజావాణి

హైదరాబాద్, ప్రభాత సూర్యుడు : మహాత్మా జ్యోతి బా పూలే ప్రజాభవన్ లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కి వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జిదారులతో ప్రజావాణి నోడల్ అధికారి హరిచందన మాట్లాడారు. అర్జిదారుల సమస్యలను తెలుసుకుని, దరఖాస్తులు స్వీకరించారు. ప్రతి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకు వచ్చి, పరిష్కరించనున్నట్లు అర్జీదారులకు ఆమె వివరించారు. ప్రత్యేక కౌనీ టర్ల ద్వారా అర్జీదారుల నుండి అధికారులు దరఖాస్తు లు తీసుకున్నారు. అదనపు కలెక్టర్ మధుసూదన్ ప్రజావాణి నిర్వహణను సమన్వయం చేశారు.

బస్సులో మహిళల గొడవ

వరంగల్, ప్రభాతసూర్యుడు : రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించడంతో ఆర్టీసీ బస్సులు మహిళలతో కిటకిటలాడుతున్నాయి. అదే సమయంలో సీట్ల కోసం గొడవలూ జరుగుతున్నాయి. కర్నాటక సీన్లు తెలంగాణలో రిపీట్ అవుతున్నాయి తాజాగా వరంగల్బస్సులో ఇద్దరు మహిళలు ఘోరంగా కొట్టుకున్నారు. వరంగల్ నుంచి నర్సంపేట వెళ్తున్న బస్సులో మహిళలు పెద్దసంఖ్యలో ఎక్కారు. ఈ క్రమంలో ఓ మహిళ తాను ముందే ఆపుకున్న సీట్లో మరో మహిళ కూర్చోవడంతో గొడవకు దిగింది. మాటామాటా పెరిగి జుట్లు పట్టి కొట్టుకున్నారు.

వన్యప్రాణి వేటగాళ్లు అరెస్ట్

ఆదిలాబాద్, ప్రభాతసూర్యుడు : సిర్పూర్ అటవీశాఖ రేంజ్ పరిధిలోని చింతకుంట గ్రామ సమీపంలో కొందరు దుండగులు విద్యుత్ తీగలు అమర్చి రెండు చుక్కల దుప్పులను హతమార్చారు. అ ఘటనలో 15 మందిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ తరలించినట్లు కాగజ్‌నగర్ ఎఫ్‌డీవో వేణుబాబు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. డిసెంబర్ 23వ తేదీన చింతకుంట అటవీ ప్రాంతంలో అదే గ్రామానికి చెందిన కొందరు దుండగులు విద్యుత్ తీగలు అమర్చి రెండు చుక్కల దుప్పులను హతమార్చారు.

దీనిపై సమాచారం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. విచారణలో మొత్తం 31 మంది ఈ ఘాతుకానికి పాల్పడినట్లు వెల్లడైంది. దీంతో 31 మందిపై కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. వీరిలో 15 మందిని ఈ నెల 28న అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

పరారీలో ఉన్న మరో 16 మంది కోసం గాలిస్తున్నారు. అటవీ జంతువులను వేటాడినా, పంట పొలాల చుట్టూ విద్యుత్ కంచెలు అమర్చినా కఠిన చర్యలు తప్పవని ఎఫ్‌డీవో వేణుబాబు హెచ్చరించారు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215